# కాకి పిల్ల కాకికి...

ఆ మధ్య మా యింటికి ఓ పేరు పడ్డ రచయిత వచ్చాడు మామయ్య కోసం. ఆరోజున హాల్లో బల్ల మీద, నా కథ పడిన పత్రిక ఒకటి ఉండటం సంభవించింది. దాన్ని చూశాడతను. సంగతి, సందర్భము కనుక్కున్నాడు మా మామయ్యని. వెళ్లి పోయేటప్పుడు నన్ను పిలిచాడు.

"ఏమమ్మా, నీ కథలన్నీ ఫైలులో వుంచావా?" అన్నాడు.

నేను కొద్దిగా సిగ్గు పడ్డాను. మెడకాయ మీద తలకాయ ఉన్నవాడెవడూ అంత వరకూ నన్ను రచయిత్రిగా గుర్తించి మాట్లాడలేదు. అందులోనూ నా రచనలు చదవాలన్న కుతూహలం చూపిస్తున్నాడీ పెద్ద మనిషి. అందువల్ల నాకు సహజంగా అతనంటే గౌరవం కలిగింది.

"ఆ! వుంచాను" అన్నాను.

"రేపు వస్తాను. తీసి వుంచు" అన్నాడు. ఆ తర్వాత మేము ఏవో మాట్లాడుకున్నాము. అతను నా కథ పడ్డ పత్రిక పేజీలు తిరగేశాడు. నా కథ వున్న పేజీ చూస్తాడేమో ఏమన్నా రిమార్కు చేస్తాడేమో అని నేను కుతూహలంతో చూస్తునే వున్నాను. కానీ ఆ ధ్యాసే లేదతనికి. ఏవో కాలేజీలు, తెలుగు లెక్చెరర్లు, ట్యూటర్లు, పిల్లలు అన్నీ మాట్లాడాం. హఠాత్తుగా విషయం మార్చాడతను.

"ఇంతకీ.. వీళ్లు డబ్బిస్తున్నారేమిటి?" ఒక చిరునవ్వుతో అన్నాడీ ముక్కలు ఆ పత్రికనుద్దేశించి.

"ఆ, ఇస్తారట" అన్నాను నేను డిటో ముఖంతో..

"హ హ హ! నీ కథకీ ఇస్తారన్న మాట" అని నవ్వాడు. ఆ నవ్వు చూస్తే "నీ మొహానికి తోడు నీ కథ బాగుండడం కూడానా" అన్నట్లు నాకనిపించింది.

"నీ పేరు అప్పుడప్పుడు చూస్తూనే వున్నాను. చాలానే పడ్డాయి" అన్నాడు.

"ఊ... చాలా వరకు అనువాదాలే" అన్నాను ఏమీ తోచక. పేరు చూశానంటాడేమిటి, బాగున్నాయని ఒక కాంప్లిమెంటు పారేయకూడదా! ఎంతైనా ఆడపిల్లను కాదా అనుకున్నాను.

"ఆ... ఆ... అందుకే. ఒరిజనల్సు చదివేసి వుండడం వల్ల అనువాదాలే కదా అని చదవలేదు. పేరు చూశానంతే హి హి హి.." అన్నాడు.

గుమ్మం దాకా వెళ్ళి వచ్చి "నావి చదివావు కాదూ?" అన్నాడు. అతగాడి నవల ఒకటి సీరియల్‌గా పడింది ఆ మధ్య. నిజానికి నేను చదవలేదు. కానీ లోకాచారం ప్రకారమైతే నేనా మాట చెప్పకూడదు.

కానీ... "ఊహూ.. నేనెప్పుడూ సీరియల్సు చదవను. నాకు విసుగు" అన్నా ఏమన్నా అనుకోనీ గాక అని.

"పుస్తకం అచ్చయింది రేపిస్తా" అన్నాడు.

"సరే!" అన్నాను మూలిగినట్లుగా.

మర్నాడు నా కథలన్నీ తీశాను. అబ్బో చాలానే వున్నాయి.నేనూ రచయిత్రినే అనుకున్నాను. అన్నీ కట్ట కట్టి ఒక కవరులో పెట్టాను. అతనికిచ్చాను మర్నాడు. అతని "రచయిత అభినందనల్తో" ఒక పుస్తకం ఇచ్చాడు. నవల నాచేతికిచ్చేప్పుడు అతని ముఖం చూడలేదు కానీ, నా రచనల కట్ట అందించేప్పుడు నా ముఖం ఎల్లా వుందో నేనేరుగుదును... ఓహ్! గర్వంగా, నిర్లక్ష్యంగా ఇమాజినేటివ్‌గా.

ఆతర్వాత ఓ నాల్గురోజులికి నిక్కి నీల్గి ఆ నవల చదివాను. అడుగడుక్కి లోపాలు కనిపించాయి. అబ్బే. ఏమిటీ శైలి అనుకున్నాను. మరీ పాత తరహాగా వుంది. అబ్బెబ్బె, ఆడవాళ్లను గురించి భయంకరమైన అభిప్రాయాలున్నాయి ఇతనికి అనుకున్నాను. ఇలాగే ఎన్నెన్నో! అన్నీ ఘోరంగానే కనిపించాయి నాకు, ఆ నవలకి సంబంధించినంతవరకు.

మరి యింతకీ... నా కథలు నచ్చే వుంటాయి అతనికి. ఐనా అతనికి తనని గురించి చాలా సదభిప్రాయం ఉన్నట్లుంది. దాన్ని చెదరగొట్టేయాలనుకున్నాను.

అతనికి పుస్తకం తిరిగి ఇచ్చేస్తూ ఒక చవట నవ్వు నవ్వాను. "బాగుంది" అని ఆ చిరునవ్వు భావంగా అతను అనుకోవాలని నా అభిమతం. మరి అదెంతవరకు అర్థమైందో అతనికి, అతనూ అల్లాగే నవ్వాడు. నా కథలు ఇచ్చేసి, "హి...హి... హి.. చదివాను" అన్నాడు. ఘనకార్యం చేశావు అనుకున్నాను. ఐనా నా కథల్లో ఎంత భావనాశక్తి, శిల్పము, మానవత్వం అనుకున్నాను కానీ... ఆక్షణంలోనే అతనూ అల్లాగే అనుకుంటాడు. తన నవలని గురించి.... అని ఛాయామాత్రంగా నాకనిపించకపోలేదు.

**– ఆంధ్ర వార పత్రిక**

**22-8-1956**